# మనసుకీ మనిషికీ మధ్య



సిగరెట్టు పొగను బయటకు వదిలి భార్య భుజంమీద చెయ్యివేసి దగ్గరగా లాక్కుని "వెళ్లొస్తాను డియర్" అన్నాడు రామచంద్రం.

ఇందుమతి మాట్లాడలేదు. దిగులుగా అతని మొహంలోకి చూసింది. ఆ కళ్లలో దిగులుతో పాటు పల్చటి నీటిపొరలు అతనికి కనిపించాయి.

"దిగులుపడకు. రేపు రాత్రికి ఈ రామచంద్రం నీ బాహు బంధాల్లో బందీ" అంటూ నవ్వేడు.

ఇందుమతి నవ్వలేదు.

వాళ్లిద్దరూ గుమ్మందగ్గర నిల్చున్నారు.

ఏదో చెబుదామని ప్రయత్నించింది ఇందుమతి. కానీ చెప్పలేదు.

"మరి నే వెళతాను" అని ఇందుమతి బుగ్గమీద చిటికె వేసి గోడవారగా వున్న సూట్కేసును తీసుకుని టకటకా బయటకు నడిచాడు రామచంద్రం.

అతని వెనుకే ఆమె గేటు దగ్గరకు వెళ్ళింది.

రోడ్డుమీద ఖాళీగా వెళుతున్న రిక్షాను ఆపి ఎక్కి కూర్చున్నాడు.

రిక్షా కదలబోతుండగా మరోసారి ఇందుమతి కేసి చూసి చిరునవ్వు నవ్వేడు. కదిలింది రిక్షా.

రివ్వున పరిగెత్తి రిక్షాను ఆపి అడ్డుగా నిల్చుని, "ప్లీజ్... మీరు వెళ్లొద్దు. కర్కశంగా నన్ను ఒంటరి రాక్షసికి ఎరగా వేసి మీరు వెళ్లొద్దు... ప్లీజ్..." అని చెబుదామనుకున్నంత ఆవేశం వచ్చింది. కానీ ఇందుమతి అంగుళం కూడా అక్కడినించి కదల్లేదు.

అవును. తను ప్రాధేయపడినా అతను తన ఎదురుగా కూర్చోలేడు. కూర్చుంటే ఎలా జరుగుతుంది? అది అతని ఉద్యోగం. సేల్స్‌మన్. నెలలో పదిరోజులయినా ఇతర వూళ్లకు వెళ్లవలసిన అవసరం వుంటుంది.

నవ్వుతూ చెయ్యి వూపాడు రామచంద్రం. కదిలి ముందుకు పోయింది రిక్షా. నిముషంలో ఆవీధిని దాటిపోయింది రిక్షా. మరో రెండు నిమిషాలు అక్కడే గేటుదగ్గర నిల్చుని పోయింది ఇందుమతి. ఆమెకుఎందుకో దుఃఖం కలిగింది.

తర్వాత గేటును చేరవేసి ఇంట్లోకి నడిచింది. ఏదో వెలితి కొట్టవచ్చినట్టు కనిపించింది. ఇందుమతికి ఇది మామూలే. ఐనా భరించలేదు.

కుర్చీలో కూర్చుని క్రితంరోజు ఉదయం రామచంద్రం తీసుకువచ్చిన ఓ పత్రికను చేతికి తీసుకుంది ఇందుమతి. పేజీలు భారంగా కదులుతున్నాయి. ఆమె దృష్టి పత్రికమీద వున్నా ఆలోచనలు మధుసూదన్ మీదే వున్నాయి.

"మధుసూదన్... మధుసూదన్..." చిన్నగా గొణుక్కుంది తనలో తనే. చేతిలో పత్రికను టేబిల్‌మీదకు గిరాటేసింది.

ఇందుమతిలో అలజడి మొదలయ్యింది. కళ్లుమూసికొని కుర్చీలో వెనక్కు వాలింది. మూసుకున్న ఆమె కనులముందు మధుసూదన్ నవ్వుతున్నాడు.

'భగవాన్... ఈ మధుసూదన్ నించి నన్ను రక్షించు" మరింత గట్టిగా కళ్లు మూసుకుంది. కళ్లను గట్టిగా మూసుకున్న కొద్దీ మరింతగా కనపడుతోంది అతని రూపు.

ఎక్కడి వాడీ మధుసూదన్. ఎప్పుడో రెండేళ్ల క్రితమే అతన్ని మరచిపోయాననుకుంది. అతని తలపులనించి విముక్తి పొందాననుకుంది.

కాని మళ్లీ రెండు నెల్లక్రితం తలవని తలంపుగా తన జీవితంలోకి చీకటినీడలా ప్రవేశించాడు.

దీనికంతటికీ కారణం తన భర్తే- రామచంద్రం. రెండు నెల్ల క్రితం ఓ ఆదివారం రోజు -

తన భర్త రాకకోసం ఎదురుచూస్తూ ఏదో నవల చదువుకుంటోంది. ఎవరిదో అడుగుల చప్పుడు వినిపించి తలయెత్తి చూస్తే- ఎదురుగా నవ్వుతూ నిలుచున్న రామచంద్రం- అతని పక్కనే మధుసూదన్. సులభంగానే గుర్తించి ఆశ్చర్యపోతూ లేచి నిల్చుంది.

"ఇందుమతీ" ఆశ్చర్యంతో చిన్నగా అన్నాడు మధుసూదన్.

"అరె! నీకెలా తెలుసు ఇందూ?" రామచంద్రం విస్తుబోయేడు.

"ఇద్దరం డిగ్రీలో క్లాసుమేట్సుం"

"పరిచయం చేసే శ్రమ తప్పించారు" నవ్వేడు రామచంద్రం.

ఇద్దరూ చెరో కుర్చీలో కూర్చున్నారు.

"తన భర్త మధుసూదన్‌కు ఎలా తెలుసు?"

తను ఇలా ఆలోచిస్తుంటే తన ఆలోచనలను చదివినట్టు అతను నవ్వుతూ " రామచంద్రం నాకెలా తెలుసునని అనుకుంటున్నావు కదూ? స్కూల్లో ఇద్దరం కలిసే చదివాం" అని చెప్పాడు మధుసూదన్.

రెండేళ్ళ తర్వాత మధుసూదన్ నవ్వులోని అందాన్ని చూసింది ఇందుమతి. వెంటనే ఏవో జ్ఞాపకాల పంరపరలు.

తర్వాత రామచంద్రం బలవంతం మీద ఇందుమతి సినిమాకు బయల్దేరక తప్పలేదు. మధుసూదన్‌కూడా వచ్చాడు.

ఇంటర్వెల్ వరకు తనతో ఎక్కువగా మాట్లాడలేదు అతను.

సిగరెట్టు కాల్చుకోడానికి ఇంటర్వెల్‌లో బయటకు వెళ్లాడు రామచంద్రం. ఇందుమతి ఆలోచనలకు బ్రేకు పడింది.

ఎవరో గేటు తెరిచిన చప్పుడు వినిపించి కుర్చీలో నించి లేచి నిల్చుని చూస్తే లోపలకు వస్తున్న పోస్ట్‌మేన్ కనిపించాడు.

ఎదురువెళ్లి అతని చేతిలోని కవరందుకుంది. కవరు మీద వున్నది తన పేరే. ఆత్రంగా చించి చూస్తే అందులో కార్డుసైజుఫోటో, దానితో పాటు ఓ ఉత్తరం. ఆమెకు గుండెలు టకటకా కొట్టుకున్నాయి. అది ఇందుమతి- మధుసూదన్ కలిసి తీయించుకున్న ఫోటో.

గబగబా ఉత్తరాన్ని చదివింది.

డియర్ ఇందూ-

మూడు రోజుల క్రితం నేను ఇక్కడకు వచ్చాను. ఫోటో ఆల్బమ్ తిరగేస్తుంటే మన ఫోటో కనిపించింది. నీకు నా పక్కనే నిన్ను చూసుకోవాలని అనిపిస్తుందని నాకు తెలుసు. అందుకే ఈ ఫోటోను నీకు పంపుతున్నాను. చూడు. ఇద్దరి జంట ఎంత బావున్నదో! ఈ ఫోటో నీ దగ్గర లేదని నాకు తెలుసు. ఆరోజు నా కళ్లముందే దాన్ని చించేసేవు కదూ?–

ఆ ఉత్తరాన్ని చదవగానే ఇందుమతి ఆలోచనలు వెనక్కు పరుగుదీశాయి.

అవును. చించెయ్యక ఏంచేస్తుంది? ఫోటోను తనచేతికిస్తూనే ఆ దుర్వార్తను తనతో చెప్పాడు మధుసూదన్.

ఆరోజు సాయంత్రం పార్కులో ఇద్దరూ పక్కపక్కగా ఒకరిభుజాలు ఒకరికి రాసుకుంటున్నట్టుగా కూర్చుంటే బరువుగా కదిలాడు మధుసూదన్. తలతిప్పి అతని మొహంలోకి చూసింది.

అతను ఈజీగా ఫీలవడం లేదు.

"ఎందుకలా వున్నావ్?"

"నీతో ఓ విషయం చెప్పాలి"

"చెప్పు"

"నువ్వు బాధ పడతావు"

"అలాగని చెప్పకుండా వుండగలవా?"

"ఐతే చెబుతాను"

నిమిషంపాటు నిశ్శబ్దం.

"మనిద్దరం పెళ్లి చేసు8కోబోతున్నట్టు మామయ్యకు ఉత్తరం రాశాను. ఆ ఉత్తరాన్ని అత్తయ్య కూతురు వేదవతి చదివి బావిలో దూకబోయిందిట. ఎవరో చూసి పట్టుకున్నారుట. నా కారణంగా వేదవతి ఆత్మహత్య చేసుకుందనే బాధతో నీతో సుఖంగా కాపురం చెయ్యగలనా? టెలిగ్రాం వచ్చింది. రేపే అత్తయ్య దగ్గరకు వెళుతున్నాను"

తను బిగుసుకుపోయింది. ఎవరో తన గుండెలమీద బాదినట్టు అనిపించింది. ఎదురుగా వున్న చెట్లన్నీ వొరిగి తనమీద పడబోతున్నట్టు వణికిపోయింది.

"బాధపడుతున్నావా?" నంగిగా అడిగాడు మధుసూదన్.

"పిచ్చి మధుసూదన్... బాధపడకుండా వుండటానికి నేను బండను కాను. కాని కాలం ఈ బాధను మాన్పగలదనే నమ్మకం నాకుంది. దయచేసి నన్ను మరచిపో... కంగ్రాచ్యులేషన్స్"

కసిగా చేతిలోని ఫోటోను చించివేసింది.

ముక్కలు గడ్డిమీదకు ఎగిరిపోయేయి.

చేతిలో వున్న ఫోటో కేసి, ఉత్తరంకేసి చూసింది ఇందుమతి. ఫోటోలో ఇద్దరూ నవ్వుతున్నారు.

అన్నీ సవ్యంగా జరిగినట్లయితే మధుసూదన్ భార్య అయివుండేది. అప్పుడు ఈ రామచంద్రం ఎవరో??

వంట గదిలోకి వెళ్లి అగ్గిపుల్ల గీసి ఫోటోకి వెలిగించింది. ఉత్తరాన్ని కూడా అంటించింది. కాలిపోతున్న ఆరెంటినీ చూసింది. నిమిషంలో ఆరెండూ బూడిదయినాయి.

మళ్లీ వచ్చి కుర్చీలో కూర్చుంది. తెగిన ఆలోచనల గొలుసుకు అతుకు పడింది.

అప్పటివరకు తను మధుసూదన్ భార్య గురించే అడగలేదు. ఇంకా తన భర్త థియేటర్‌లోకి రాలేదు.

"నీభార్య అందమైనదేనా? ఎంతమంది పిల్లలు?"

విషాదంగా నవ్వాడతను.

"నీకు తెలీదు కదూ? పెళ్లయిన ఏడాదికే నా భార్య నన్ను వొంటరివాడిని చేసి ఈ లోకాన్ని వదిలింది. ప్రస్తుతం నేను ఒంటరివాడిని" ఆమాట చెబుతున్నప్పుడు అతని గొంతులో దుఃఖపు జీరను తను గుర్తించకపోలేదు. ఆ నిముషంలో అతనిమీద కొండంత సానుభూతి.

తను మాట్లాడలేదు.

అటు తర్వాత ప్రతి ఆదివారం తమ ఇంటికి వచ్చేవాడు మధుసూదన్. తమ ఇంట్లోనే భోజనం.

క్రమంగా అతను తన భర్త లేనప్పుడు రావడం మొదలుపెట్టాడు. గతాన్నంతా తవ్వాడు. తనలో ఆవేశాన్ని కలిగించాడు. ఓ మెట్టు కిందికి దిగింది తను. అతనూ తనకు మరింత దగ్గరయినాడు. తన చేతివేళ్లను తాకడం, తన భుజాలమీద చేతులు వెయ్యడం.... అతడిని గట్టిగా వారించలేక పోయింది. తనలోని బలహీనతను ఆసరాగా తీసుకుని మధుసూదన్ తనని పొందాలని ప్రయత్నిస్తున్నాడు.

అతని ఆలోచనలను గ్రహించగానే తను అదిరిపడ్డది. తను ఎంతటి విషమ పరిస్థితుల్లో చిక్కుకున్నదో గ్రహించి వణికిపోయింది. రామచంద్రం దుర్మార్గుడు అయినట్లయితే తను మధుసూదన్‌కి ఎప్పుడో లొంగిపోయివుండేది. కాని తన భర్త అమాయకుడు.

ఇరవైరోజుల క్రితం తనని అడిగాడు రామచంద్రం.

"నువ్వు మధుసూదన్ ఆరోజుల్లో ప్రేమించుకున్నారట కదా"

ఉలిక్కిపడింది. ఆ తర్వాత వణికిపోయింది.

అదిచూసి అతను "పిచ్చి ఇందూ... ఆ బెదురెందుకు? ఆ వయసులో ప్రేమించుకోవడం

సహజం. అది తప్పుకాదు. నేరం కాదు. అందరూ చేసేపనే అది. నువ్వు నా భార్యవు కావటం నా అదృష్టం" అంటూ తనని ముద్దు పెట్టుకున్నాడు ప్రేమగా-

అలాంటి మనిషికి తను అన్యాయం చెయ్యగలదా? తనవల్ల కాదు. రామచంద్రంకి తను ద్రోహం చెయ్యలేదు. ఎలాగైనా తనని తాను కాపాడుకోవాలి. మధుసూదన్ బారినుండి బయటపడాలి. ఎలా? ఎలా?

ఈ విషయాన్ని తన భర్తతో చెబితే?

'మధుసూదన్ నన్ను కబళించాలని చూస్తున్నాడు. నన్ను రక్షించండి' అని రామచంద్రంతో తను చెప్పగలదా? చెప్పలేదు. తన భర్తకు మధుసూదన్ అంటే ఎంతో గౌరవం. అతను తనకు ప్రాణస్నేహితుడని ఆయన నమ్మాడు. అటువంటి వ్యక్తే తనకు ద్రోహం చేస్తున్నాడని తెలిస్తే రామచంద్రం భరించలేడు. కోపమొస్తే రామచంద్రం పులి.

మధుసూదన్‌కి ఏదయినా జరిగితే తను భరించలేదు. అతన్ని తను ఇప్పటికీ ప్రేమిస్తోంది. ఆ శక్తినించి తప్పించుకునే ధైర్యం తనకు లేదు. అప్పటికీ తను మధుసూదన్‌కు ఎన్నోసార్లు చెప్పింది.

"ప్లీజ్... మధూ... ఇకనించీ మా ఇంటికి రాకు. నేను పెళ్లయిన దాన్ని. నా ప్రేమను మరొకమనిషికి పంచుతున్నానని తెలిస్తే రామచంద్రం భరించలేడు. దయవుంచి నా కంటికి కనిపించకు" ప్రాధేయపడుతున్నట్టు అడిగింది.

మధుసూదన్ నవ్వేడు.

"నిజంగా ఇప్పుడు నన్ను చూడకుండా నువ్వు వుండగలవా?" అడిగాడు సూటిగా తన కళ్లలోకి చూస్తూ-

తల దించుకుంది.

మరోసారి నవ్వి "ఆల్‌రైట్... నీ యిష్టం. మిత్రుడికి అన్యాయం చేస్తున్నాననే బాధ నాలోనూ మెలితిరుగుతోంది. ఐనా ఏం చెయ్యను? నా బలహీనత. నిన్ను కలవకుండా వుండలేక పోతున్నాను. నేనూ ప్రయత్నం చేస్తాను" వెళ్లిపోయాడు.

తనకు దుఃఖం ఆగలేదు. ఆ క్షణంలో కాలేజీ రోజుల్లో అతనితో తన మాటలు, వాగ్దానాలు, సినిమాలకు వెళ్లిన దృశ్యాలూ, ఎన్నో అందమైన సాయంత్రాలు ఒకరికళ్లలోకి ఒకరు చూసుకుంటూ గడిపిన క్షణాలూ కనులముందు కదిలి నిలవలేకపోయింది. ఏడ్చింది.

తర్వాత అనుక్షణమూ అతని రాకకోసం ఎదురుచూసింది.

రెండు రోజుల తర్వాత సాయంత్రం మార్కెట్టుకు వెళితే మధుసూదన్ స్కూటరుమీద వెళుతూ కనిపించాడు.

ప్రాణం లేచివచ్చినట్లయితనే పలకరించింది. ఇంటికి రమ్మని మరీ మరీ అడిగింది.

తను కోరినట్లే మరురోజు వచ్చాడు.

"ఇప్పటికయినా తెలుసుకున్నావా నన్ను చూడకుండా వుండలేనని"

తను మవునంగా కూర్చుంది.

"ఇందూ... ఒకవేళ ఇప్పటివరకూ నీకు పెళ్లి కాలేదనుకో... నన్ను చేసుకోటానికి ఇష్టపడేదానివేనా?" కుర్చీని తన దగ్గరకు జరుపుకుంటూ అడిగాడు.

తను మౌనాన్ని వదల్లేదు.

"నాకు తెలుసు. నువ్వు సంతోషంగా వొప్పుకునేదానివి" మళ్లీ తనే అన్నాడు.

కొంచెం ముందకు వొంగి తన చేతిమీద వేలితో రాస్తూ "ఇందుమతీ... నిన్ను చూస్తుంటే రామచంద్రం భార్యవనే ఫీలింగ్ కలగడం లేదు. ఆ రోజుల్లో నా ప్రేయసిలాగే కనపడుతున్నావు" అని తన భుజంమీద చేత్తో నొక్కుతూ "నిన్ను చూస్తుంటే నాలో ఆవేశం ఆగటం లేదు" అని తనని గట్టిగా కౌగిలించుకున్నాడు. పెదవులమీద ముద్దు పెట్టుకోబోయాడు. తలను వెనక్కు విరుచుకుంది.

"ప్లీజ్... వదులు... నేను రామచంద్రం భార్యని... రామచంద్రం భార్యని" అతన్ని వెనక్కి నెట్టింది.

అతను వదల్లేదు. ఆవేశంతో మరింత గట్టిగా తనని గుండెలకు అదుముకున్నాడు.

ఒక్కసారి తన బలాన్నంతా ఉపయోగించి వెనక్కు నెట్టి రివ్వున పరిగెత్తి వంటగదిలోకి వెళ్లి భళ్లున తలుపులను మూసింది.

"వెళ్లిపో... వెళ్లిపో... మధుసూదన్ వెళ్లిపో" ఏడుపు మధ్యలో అరుస్తూ చెప్పింది.

తర్వాత ఎప్పటికో అతను వెళ్లిన పాదాల చప్పుడు విని తలుపు తీసుకుని బయటకు వచ్చింది.

తన మోహాన్ని రామచంద్రానికి చూపలేకపోయింది. తప్పుకుని తిరిగింది. ఆక్షణంలో మధుసూదన్‌కు లొంగిపోతుందేమోనని భయపడింది. అప్పుడు ఎలాగో తప్పించుకోగలిగింది. కానీ ఏదో ఒకరోజు తను మధుసూదన్‌కు లొంగిపోవడం నిజం. తనలో ఆ బలహీనత వుంది. అతనికి లొంగిపోయి రామచంద్రం భార్యగా నటించలేదు.

తన బ్రతుకు మధుసూదన్ కౌగిలిలో కాలిపోవడం ఖాయం. కానీ అలా జరక్కముందే తను ఇద్దరి మధ్యనించీ తప్పుకోవాలి.

రామచంద్రం కుమిలిపోతాడు. నిజమే. అయినా తప్పదు.

ఈ రాత్రికే పూర్తించి వస్తానని చెప్పాడు మధుసూదన్. అతను రాకముందే తన చరిత్ర ముగిసిపోవాలి.

చీకటి పడుతోంది.

కుర్చీలోనించి లేచి నీరసంగా బాత్‌రూంలోకి వెళ్లింది. గదిలో ఓ మూలగా వున్న చెక్కపెట్టెను తెరిచింది. లోపలవున్న నల్లులమందు సీసాను బయటకు తీసింది.

టిక్ ట్వెంటీ...

నిండావుంది మందు. దాన్ని అక్కడే వుంచి మళ్లీ ఎందుకో ఇంట్లోకి నడిచింది. ఎదురుగా గోడకు తగిలించిన పెద్దఫోటో కనపడింది. అది తమ పెళ్లినాటి ఫోటో.

రామచంద్రం- తను.

చూస్తూ నిలుచుంది. ఏవో ఆలోచనలు ముసురుకుంటున్నాయి.

ఇందుమతి ముఖంనిండా విషాదరేఖలు. ఆమె కనుల వెంట నీళ్లుకారి గుండెలమీదకు జారుతున్నాయి.

ఎంతసేపు నిల్చున్నదో... విసురుగా గేటు నెట్టుకుని లోపలకు వచ్చిన రామచంద్రం భార్య మొహాన్ని చూసి,

"నీకీ విషయం ముందుగానే తెలిసిందా!" అని అడిగాడు ఆశ్చర్యంగా-

ఉలిక్కిపడి ఎదురుగా నిలబడివున్న భర్తను చూసి "ఏమిటి" అన్నది కంగారుగా కన్నీళ్లను తుడుచుకుంటూ-

"ఐతే నీకీ విషయం తెలీదా? మధుసూదన్ ఎక్కి వస్తున్న బస్సు మధ్యాహ్నం కొండమీదనించి లోయలోకి పడిపోయింది. అందరూ చనిపోయేరు. నేను అతని వూరివైపుకే వెళ్లాను. పనయిపోవటం వల్ల వెంటనే బయల్దేరాను. ఆ బస్సు వెనుక బయల్దేరిన బస్సులో నేనూ వచ్చాను. మధుసూదన్‌ని అతి కష్టంమీద గుర్తుపట్టగలిగాను"

ఇందుమతి మెదడు మొద్దుబారిపోయింది. ఆమెకేమీ అర్థంకాలేదు. తూలి కిందపడబోయింది. గబుక్కున రామచంద్రం ఆమెను పట్టుకుని భుజంమీద వేసుకుని తీసుకెళ్లి బెడ్‌మీద పడుకో బెట్టాడు.

భార్య మొహంలోకి చూస్తూ తను వచ్చేసరికి ఆమె ఎందుకు ఏడుస్తోంది? అని ఆలోచిస్తున్నాడు.

బాత్‌రూం చెక్కపెట్టెలో టిక్‌ట్వెంటీ సీసా ఇందుమతికోసం ఎదురుచూస్తోంది.

కాని-

ఏ మనిషి బారినించి విముక్తి పొందటానికి తన జీవితాన్ని అంతం చేసుకోవాలనుకుందో ఆ మనిషి జీవితమే అంతమయిందని దానికేం తెలుసు??

(ఆగష్టు 1978 స్వాతి మాసపత్రికలో ప్రచురితం)